

## విలేఖరులకు ఆహ్వానం

వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన విలేఖరులు, అడ్వటైజ్ మెంట్ ఏజెంట్లకు యాజమాన్యం స్వాగతం పలుకుతోంది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల స్టాఫ్ రిపోర్టర్లతోపాటు నర్సంపేట, కాటారం, మరిపెడ, క్రైం, ఎంజీఎం, గ్రేన్ మార్కెట్, వరంగల్ కలెక్టరేట్, హనుమకొండ కలెక్టరేట్, స్టేషన్ ఘనపూర్ పరిధిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్ 99891 24061, 98499 43339 లలో సంప్రదించగలరు. - వరంగల్ వాయిస్ యాజమాన్యం


# వరంగల్ వాయిస్


Evening Daily

సంపుటి : 04 | సంచిక : 337
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
అక్టోబర్ 25, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


- దండకారణ్యంలో జన జాతర
- సమీపిస్తున్న ఆదివాసీ కుంభమేళా
- జనవరిలోనే సమ్మక్క, సారలమ్మ మహాజాతర
- మేడారం గద్దెల పునర్నిర్మాణం
- వసతులకు రూ.150 కోట్లు కేటాయింపు






వివరాలు 2లో..

# నయా మేడారం

## శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

ఆదివాసీ కుంభమేళాకు సమయం సమీపిస్తోంది. దండకారణ్యంలోకి దండు కట్టేందుకు అశేష జనావళి సిద్ధమవుతోంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీల జాతర ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగనుంది. రెండు సంవత్సరాలకోసారి జరిగే మహాజాతరకు కోట్లాదిగా భక్తులు తరలిరానున్నారు. 2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మేడారంలో మహా జాతర నిర్వహించేందుకు ఆదివాసీ గిరిజన పూజారులు తేదీలు ఖరారు చేశారు. అయితే దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమైంది. మహా జాతరలో వసతి, సౌకర్యాలు కల్పించేందుకు రూ. 150 కోట్లు కేటాయించింది. ఆధునిక రీతిలో వనదేవతల గద్దెల పునర్నిర్మాణం, రహదారుల విస్తరణ, మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, కల్వర్టులు, జంపన్న వాగు పరిసరాల్లో స్నానఘట్టాలు, ఇతర వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేకంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. మేడారం పనులను కలెక్టర్ ఒక టాస్క్ గా తీసుకొని నిర్ణీత సమయంలో వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షలు చేస్తున్నారు.



8లో..

## మార్నింగ్ ప్రెజెంట్..
# మిడ్డే ఆబ్సెంట్

- నామమాత్రంగా తెరుచుకుంటున్న అంగన్వాడీ సెంటర్లు
- సవాలక్ష సాకులతో సెంటర్లు క్లోజ్
- పౌష్టికాహారానికి దూరమవుతున్న చిన్నారులు
- నిర్లక్ష్యానికి ఆజ్యం పోస్తున్న ప్రజాప్రతినిధులు

## కన్నుల పండుగలా
# కార్తీక దీపోత్సవం

ప్రతి దేవాలయాన్ని దీపాలతో అలంకరించాలి

ఎండోమెంట్ అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

8లో..



8లో..



# తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- కేయూలో నెలవారీ నేర సమీక్ష





# నయా మేడారం

- దండకారణ్యంలో జన జాతర
- సమీపిస్తున్న ఆదివాసీ కుంభమేళా
- జనవరిలోనే సమ్మక్క, సారలమ్మ మహాజాతర
- మేడారం గద్దెల పునర్నిర్మాణం వసతులకు రూ.150 కోట్లు కేటాయింపు

## శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

**ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులు ఊపందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి 23 సెప్టెంబర్ 2025 న వనదేవతలను దర్శించుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆదివాసి సంప్రదాయాల మేరకు అమ్మవార్లకు గత నెల 30న పూజారులు ప్రత్యేక పూజలు చేసి భూమి పూజతో పనులకు అంకురార్పణ చేశారు. దీంతో మేడారం జాతర పనులు జోరందుకున్నాయి. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.** ప్రధానంగా ఈ ఉత్సవానికి చేసే ఏర్పాట్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా, శాశ్వతంగా ఉండాలని భావించింది. అందులో భాగంగానే తాత్కాలిక పనులకు స్వస్తిపలికి.. శాశ్వత నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. గిరిజనుల ఆరాధ్య దైవాల ప్రాంగణాలు వెయ్యేళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా గిరిజన సంస్కృతి ప్రతిబింభించే ఆకృతులు ఉండేలా నిర్మాణాలు చేస్తున్నారు. మహా జాతరలో భాగస్వామ్యం ఉన్న ప్రతి శాఖకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలన్నీ మేడారం పనుల పూర్తికి నిరంతరం పాటుపడుతున్నాయి.

### శాశ్వత పనులు..

మేడారం మహా జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. గిరిజన సంక్షేమ శాఖ ఈ నిధులు మంజూరు చేయగా.. వాటిలో రూ.90 కోట్లు సివిల్ వర్క్ లకు, రూ.60 కోట్లు నాన్ సివిల్ వర్క్ ల కోసం ఖర్చు చేస్తున్నారు. మేడారంలో తల్లుల గద్దెల విస్తరణ, ఒకే లైన్ లో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, సాలాహారం నిర్మాణం, డ్రైనేజీ పనులు, క్యూ లైన్ లు, మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులు స్వీడందుకున్నాయి. సహజ సిద్ధమైన వాతావరణం చెదరకుండా ఈ పనులన్నీ 100 రోజుల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. దీంతో కలెక్టర్ దివాకర ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ సకాలంలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

### సకల సౌకర్యాలు..

2026 జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగే మేడారం జాతరకు తరలి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పోలీసులు 49 ప్రాంతాలను గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేట్, వీఐపీ, వీవీఐపీ వెహికల్స్ పార్కింగ్ చేయడానికి 1,050 ఎకరాలను కేటాయించారు. ఈ పార్కింగ్ స్థలాలలో ఒకేరోజు సుమారు ఆరు లక్షల వరకు వాహనాలను పార్కింగ్ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా, జాతర నిర్వహణకు కోర్ ఏరియాను ఎనిమిది జోన్లు, 31 సెక్టార్లుగా విభజించారు. మహా జాతర సమయంలో సుమారు 12 వేల మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. ప్రతి జోన్ కు ఒక జోనల్ ఆఫీసర్ ను నియమించనున్నారు. ప్రధాన రహదారుల్లో లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. 259 ట్రాన్స్ ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు అమర్చే పనులను విద్యుత్ శాఖ చేపట్టింది. అదేవిధంగా 61.17 కిలోమీటర్లు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా జాతరలో 350 మంది సిబ్బంది విధులు నిర్వహించడమే కాకుండా, మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపడుతున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతర ప్రాంగణమంతా రంగురంగుల విద్యుత్ బల్బులతో తీర్చిదిద్దే ఇల్యుమినేషన్ వర్క్స్ జరుగుతోంది. ఈసారి భక్తుల సౌకర్యార్థం 24 శాశ్వత టవర్స్, 20 సెల్ ఆన్ వీల్స్, 350 వైఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో 33 ఫారెస్ట్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. వైల్డ్ లైఫ్ ఏరియాలో ఉన్న కచ్చా రోడ్లను కూడా ఇందులో చేర్చి వృద్ధి చేస్తున్నారు. మేడారం జంపన్న వాగు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు పుణ్యస్నానాల కోసం వాగులో దిగి లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నందున, లోతు ఉన్న ప్రాంతాల వద్ద వీటిని అమర్చారు. ముఖ్యంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నారు.










### ఇబ్బందులు లేకుండా చూస్తాం..

**□ దివాకర టీఎస్, కలెక్టర్, ములుగు**

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు చక చకా సాగుతున్నాయని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. వనదేవతల గద్దెల నిర్మాణ పనులు, రోడ్ల విస్తరణ, దేవస్థానం చుట్టూ నిర్మించే ప్రాకారం, ఆర్చి, గేట్ పిల్లర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాం. మహా జాతరకు ముందుగానే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ముఖ్యంగా తల్లుల దర్శనానికి ప్రతిరోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూజారులు, అధికారులు, గుత్తేదారులతో మాట్లాడి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. అదేవిధంగా




మేడారం దేవస్థానం అభివృద్ధికి అవసరమయ్యే భూసేకరణపై దృష్టి సారించాం. గద్దెల చుట్టూ ఉన్న 19.27 ఎకరాల భూమిలోని రైతులతో మాట్లాడి మేడారం దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరాం. ముఖ్యంగా రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరిపిస్తున్నాం. అభివృద్ధి పనులను పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్నామన్నారు. ప్రతిసారి జరిగే మహా జాతరలో భక్తులు ఇబ్బందులకు గురయ్యే విషయాలను దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ అమలు చేసి మేడారం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఆదివాసి పెద్దల ఆలోచనలతో గద్దెల మార్పు, పరిసరాల అభివృద్ధి, అమ్మవార్ల గద్దెలు, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఒకే వరుసలో ఉండేందుకు నిర్ణయించామని తెలిపారు. వేయ్యేళ్లు చరిత్రలో నిలిచేలా మేడారంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని కలెక్టర్ దివాకర చెప్పారు. భక్తులతో పాటు ఆదివాసీల భవిష్యత్ తరాలకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఆదివాసీల సంస్కృతి అందరికీ తెలిసేలా ప్రత్యేక రాతి శిలలపై చరిత్ర చెక్కించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులైన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మేడారం ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు.

3
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, అక్టోబర్ 25, 2025

# క్రెడిట్ కార్డు బిల్లుల పేరుతో బురిడీ

- రూ. 6 లక్షలు స్వాహా చేసిన నిందితుడి అరెస్ట్
- 3 లక్షల నగదు, బంగారం, స్కూటీ స్వాధీనం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని వివిధ మండలాల్లో పెట్రోల్ బంకులు, మినీ బ్యాంకుల నిర్వాహకులను మోసం చేస్తున్న ఒక వ్యక్తిని పర్వతగిరి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. క్రెడిట్ కార్డు బిల్లులు కట్టాలని చెప్పి, ఒక్కొక్కరి వద్ద రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసి బురిడీ కొట్టించి పారిపోతున్న ఈ మోసగాడిని పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. అరెస్ట్ అయిన వ్యక్తి మహబూబాబాద్ జిల్లా రెడ్యానాయక్ కాలనీకి చెందిన రాపోలు శ్రీనివాస్ (34), తండ్రి ఐలయ్యగా గుర్తించారు. ఇతను ఇప్పటికే పర్వతగిరి, నెక్కొండ, వర్ధన్నపేట, లింగాల ఘనపూర్, రఘునాథపల్లి మండలాలలోని పెట్రోల్ బంకులు, మినీ ఏటీఎంలలో సుమారు రూ. 6 లక్షల వరకు మోసగించినట్లు విచారణలో తేలింది. శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, పైన పేర్కొన్న నేరాలన్నీ ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షల నగదు, ఆరు గ్రాముల బంగారం, ఒక బ్లూ కలర్ యాక్టివా స్కూటీ, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులు, మినీ ఏటీఎంల నిర్వాహకులు గుర్తు తెలియని వ్యక్తులు అధిక డబ్బులు ఇస్తామని చెప్పి డబ్బులు పంపించాలని కోరితే మోసపోవద్దని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పర్వతగిరి ఎస్సై బి.ప్రవీణ్, వారి సిబ్బందిని మామునూరు ఏసీపీ, ఈస్ట్ జోన్ డీసీపీ, వరంగల్ సీపీ అభినందించారు.

# రోడ్డు ప్రమాదాలపై వ్యాస రచన పోటీలు



**వరంగల్ వాయిస్, గోరి కొత్తపల్లి :** పోలీస్ అమరవీరుల స్మారక దినాన్ని పురస్కరించుకుని గోరికొత్తపల్లి మండల పోలీసు శాఖ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. గోరి కొత్తపల్లి ఎస్.ఐ. మహమ్మద్ షా ఖాన్, ప్రధానోపాధ్యాయులు ఒంటేరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. "రోడ్డు ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు, తక్షణ చర్యలు" అనే అంశంపై పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీ ద్వారా రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పీవీ. గిరిధర కృష్ణ, చక్రధర్, రాజేందర్, కోటిలింగం, శిరీష, శ్రీనివాస్, ప్రతాప్, రమాదేవి, పోలీసు సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కళాకారుడు పడాల భిక్షపతికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ రామన్నపేటలో గల డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుడు, మేకప్ ఆర్టిస్ట్ అయిన పడాల భిక్షపతిని శనివారం ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా, మొక్కను అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఓరుగల్లు పూర్వకాలం నుంచే కళాకారులకు కాణాచిగా ఉందని, నాటి రాజులు కళలను పోషిస్తూ కళాకారులకు జీవనోపాధి కల్పించారని గుర్తు చేశారు. కళాకారులు వారి జీవనోపాధితో పాటు, ప్రజలను వివిధ కళారూపాలతో పరవశింపజేసేవారని అన్నారు. సన్మానం అందుకున్న పడాల భిక్షపతి మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచే అంటే దాదాపు 60 సంవత్సరాలుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నానని తెలిపారు. వివిధ భంగిమల్లో విద్యార్థిని, విద్యార్థులకు, పెద్దలకు వివిధ రూపాల్లో వేషధారణ చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ప్రజలు కళారూపాలను మరిచిపోకుండా తన వంతుగా కృషి చేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో పాటు, ఆయన భార్య లక్ష్మి, మిట్టపల్లి సమ్మయ్య, సదానందం, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కమలాపూర్ మండలంలో ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో, ఉప్పల్ గ్రామంలో ఈ కొనుగోలు కేంద్రాలను హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడితల ప్రణవ్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉండాలని ఆయన కోరారు. ధాన్యాన్ని కల్లాల వద్దకే వచ్చి కొనుగోలు చేయడంతో పాటు, సరైన మద్దతు ధర చెల్లింపులో ఆలస్యం లేకుండా చూడాలని వారు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, జనగాని శివకృష్ణ, ఓరుసు తిరుపతి, ఆకినపల్లి భిక్షపతి, చకిలం దయాకర్, మిల్కూరి శ్రీనివాస్, నిగ్గుల లింగయ్య, యాకూబ్ పాషా, కిన్నెర కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు బాలసాని రమేష్, పుల్లూరు శ్రీనివాసరావు, బొల్లం రాజిరెడ్డి, తడక శ్రీకాంత్, డాక్టర్ మౌటం కుమారస్వామి, మాట్ల రమేష్, పోడేటి భిక్షపతి, చెరిపల్లి రామచంద్రం, పుల్ల శోభన్, దూడ శ్రీకాంత్, పోరండ్ల రమేష్, పల్లె సమ్మిరెడ్డి అనిల్, మారేపల్లి మహేష్, పాక చంద్రమౌళి, మొండెద్దుల నాగరాజు, శనిగరపు రమేష్, మాట్ల రాజేష్, మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, మార్కెట్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాట్రపల్లిలో పశువైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గ్రామాల్లో పశు సంపదను కాపాడే లక్ష్యంతో, మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని పాఠశాల ఆవరణలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎం.సునీల్, ప్రజ్వాల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం 105 తెల్లజాతి పశువులకు, 60 నల్లజాతి జీవాలకు మొత్తం 165 జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం ప్రజ్వాల్ సంస్థ ప్రతినిధి డి.రవిచందర్ మాట్లాడుతూ మూగజీవాలు తమ బాధలను చెప్పలేవని, కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండి, ముందుగానే నివారణ టీకాలు వేయించడం ద్వారా మూగజీవాలను రక్షించుకోవాలని కోరారు. తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడాలని ఆయన వివరించారు. ఈ టీకా కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమేష్ బాబు (వీఎల్ఓ), పి.రవి (జేవీఓ), ఎన్.సదానందం (వీఏ), గ్రామ రైతులు వంకుడోతు ధన్ సింగ్, వంకుడోతు బాబూసింగ్, మీసరాగండ్ల స్వామి, మీసరాగండ్ల సంపత్, జనగాం మొగిలి, పెద్దపల్లి పాణి, నవయుగ సొసైటీ డైరెక్టర్ ఒంటెరు ప్రసాద్, ఒంటెరు రాజయ్య పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలే పునాది



**వరంగల్ వాయిస్, చిట్యాల :** పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు చిట్యాల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా 'ఈసీసీ డే' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎంపీడీఓ) జయశ్రీ మేడం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటలు, పాటలు, కథల ద్వారా మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను, మంచి అలవాట్లను అంగన్‌వాడీ టీచర్లు నేర్పిస్తారని తెలిపారు. నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగడానికి అంగన్‌వాడీ కేంద్రాలు పునాదిలాంటివని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు పంపడం వల్ల నష్టాలను ఆమె వివరించారు. ఆర్థికంగా డబ్బు నష్టం. ఉదయాన్నే బాక్సుల్లో పెట్టిన ఆహారం తినలేక పిల్లలు అనారోగ్యానికి గురికావడం. పిల్లల ఎదుగుదల ఆగిపోవడం. భవిష్యత్తులో అన్ని రంగాలలో వెనుకబడి పోవడం. ఐదేళ్ల లోపు పిల్లలను ప్రైవేటు బడులకు పంపి వారి ఎదుగుదలను ఆపవద్దని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలో కాన్వెంట్ స్కూళ్లలో లేని మెటీరియల్ సహా అన్ని వసతులను సరఫరా చేస్తోందని, ఆట వస్తువులను చూస్తూనే తెలుగు, ఇంగ్లీష్ బోధనతో పాటు ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీకి సంబంధించిన బోధన అందుతోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతులను చూసి హర్షం వ్యక్తం చేసిన మహిళలు, తమ పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయప్రద హాజరై మూడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎంపీడీఓ చేతుల మీదుగా కోడిగుడ్లను పంపిణీ చేశారు. పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే దేశాభివృద్ధి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండలోని స్వధార్ మహిళా ఆశ్రమంలో కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఆమె ఉచితంగా కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి శిక్షణలలో పొందిన నైపుణ్యాన్ని ఉపాధి అవకాశాలకు వినియోగించుకుని, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మహిళల ఆలోచనలను ఆచరణలో పెట్టి, వారు స్థాయికి ఎదగడానికి కుటుంబం, సమాజం సహకరించినప్పుడే నిజమైన మహిళా సాధికారికత సాధ్యమవుతుందని అన్నారు. అనురాగ్ సొసైటీ గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ఎంతో మంది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, ఇప్పటికే ఎందరికో ఉచితంగా కుట్టు మిషన్లు అందించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వధార్ నిర్వాహకురాలు శైలజ, సంధ్యతో తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, అక్టోబర్ 25, 2025

# వైభవంగా నాగుల చవితి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన అతి పురాతన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో శనివారం నాగుల చవితి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. దేవాలయంలోని నాగేంద్ర స్వామి గుడిలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి గారు నాగదేవత విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ ఛైర్మన్ సామల భిక్షపతి రాజమణి దంపతులు ప్రత్యేకంగా పూజలలో పాల్గొని, ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగుల చవితి సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలివచ్చారు. వారు కూడా పుట్టలో పాలు, గుడ్లు పోసి, తమ కోరికలు నెరవేర్చాలని నాగదేవతను భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భాషని రమేష్, ధనలక్ష్మి శివ నాగరాజుతో పాటు పలువురు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలో నాగుల చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కొయ్యూరు సమీపాన గల నాగులమ్మ దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఆలయానికి చేరుకొని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొయ్యూరు పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

# నవంబర్ 6 నుంచి ఎంఏ తెలుగు ఇంటర్నల్ పరీక్షలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని హంటర్ రోడ్డులో గల జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో రెండవ సంవత్సరం ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ మొదటి ఇంటర్నల్ పరీక్షలు నవంబర్ 6, 7, 8 తేదీల్లో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. పరీక్షల ఇతర వివరాల కోసం విద్యార్థులు 99891 39136, 99894 17299 సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సూచించారు.

# మంత్రి కొండా సురేఖను కలిసిన ఎండోమెంట్ డైరెక్టర్ హరీష్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఎండోమెంట్ (దేవాదాయ) శాఖ డైరెక్టర్‌గా (అదనపు బాధ్యత) ఐఏఎస్ అధికారి హరీష్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, శనివారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, అదనపు బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కు మంత్రి సురేఖ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి హరీష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పద్మశాలీల కార్తీక వనభోజనం పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** నవంబర్ 9న ఎర్రగట్టు గుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న పద్మశాలి కుల బాంధవుల కార్తీక మాస సామూహిక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత అఖిలభారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం పిలుపునిచ్చారు. శనివారం కమలాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బొప్పా శివ శంకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షులు ఆనందం, వనభోజన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆనందం మాట్లాడుతూ పద్మశాలీల మధ్య స్నేహభావం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి, కుల ఐక్యతను సమాజానికి చాటేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కమలాపూర్ మండలం నుంచి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం విజయవంతం కావడానికి పద్మశాలి పరపతి సంఘాలు, నిర్వహణ కమిటీకి తోడ్పాటునందించి, ఆర్థికపరమైన చేయూతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, కన్వీనర్ గడ్డం భాస్కర్, కో కన్వీనర్ వైద్యం రాజగోపాల్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పోరండ్ల కృష్ణ ప్రసాద్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు పోరండ్ల రమేష్, వెంగళ వేణుగోపాల్, తుమ్మ శోభన్ బాబు, గైని సత్యనారాయణ, దాసి శంకరయ్య, ఆడెపు శ్రీకాంత్, మెండు రాంబాబు, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

# శ్రీ నాగలింగేశ్వర ఆలయంలో భక్తుల కోలాహలం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయ కళాక్షేత్రం రెడ్డి గుడి శ్రీ నాగలింగేశ్వర ఆలయంలో శనివారం నాగుల చవితి వేడుకలు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పానుగంటి భద్రయ్య సూర్యోదయ సమయంలో మొదట గణపతి పూజతో పూజా కార్యక్రమాన్ని ప్రారంభించి, శ్రీ నాగలింగేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గల నాగేంద్ర స్వామి పుట్టకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొని నాగేంద్ర స్వామి వారికి పాలు, పండ్లు, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రానున్న కార్తీక పౌర్ణమి రోజున ఆలయంలో సాయంత్రం 10,000 దీపాలతో దీపోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి పూజలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ 40వ డివిజన్‌లోని మంకీ ఫుడ్ కోర్టులో ఉన్న నాగదేవత పుట్ట వద్ద భక్తులకు అసౌకర్యంగా ఉన్నందున, ఆ ప్రాంతాన్ని మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి పరిచేందుకు వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ల దృష్టికి తీసుకువస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. పుట్ట వద్ద కొంత అసౌకర్యం ఉండటం వలన భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నాడు 40వ డివిజన్‌లోని మంకీ ఫుడ్ కోర్టులో ఉన్న నాగదేవత పుట్టకు ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టలో పాలు పోసి, టెంకాయలు కొట్టి, పూలు, పండ్లు, ప్రసాదాలను సమర్పించారు. వేద బ్రాహ్మణులు సరస్వతీభట్ల నాగరాజు శర్మ, ఈశ్వర్ శర్మ, ప్రదీప్ శర్మలు వాల్మీక పూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న వారికి సర్ప దోషాలు తొలగిపోతాయని, సంతాన ప్రాప్తి కలుగుతుందని, కల్యాణములు జరుగుతాయని, వృత్తి, విద్య, వ్యాపారంలో రాణించగలుగుతారని వేద బ్రాహ్మణులు భక్తులకు తెలియజేశారు.

# కిరణ్ కు అంబేద్కర్ నేషనల్ అవార్డు

- దళిత, బలహీన వర్గాల సేవలకు గుర్తింపు
- నవంబర్ 5న అవార్డు ప్రదానం

**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం (ఏవైఎస్) సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్ ప్రతిష్టాత్మకమైన అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవోస్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ శనివారం తెలిపారు. డాక్టర్ ఆకుల రమేష్ మాట్లాడుతూ కిరణ్ గత 15 సంవత్సరాలుగా చిట్యాల మండల అంబేద్కర్ యువజన సంఘంలో చురుకుగా పనిచేస్తున్నారని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను, భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. మహనీయుల కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, మృతుల కుటుంబాలను పరామర్శించి సహాయ సహకారాలు అందించారని తెలిపారు.



అంతేకాక, దళితులు, మహిళలపై జరుగుతున్న సంఘటనలను ఖండిస్తూ వారికి అండగా నిలబడటం, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని డాక్టర్ రమేష్ వివరించారు. అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన గురుకుంట్ల కిరణ్‌కు నవంబర్ 5న హైదరాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద గల సిటీ కల్చరల్ సెంటర్ ఆడిటోరియం, వివేక్ నగర్, కవాడిగూడలో ఈ అవార్డును అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసిన డాక్టర్ ఆకుల రమేష్ కి, సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్‌వాడీలలో ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీలకే అప్పగించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా 2వ మహాసభలు శనివారం రాంనగర్‌లోని సుందరయ్య భవనంలో శోభారాణి, జోష్నా, ప్రేమలత అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ మహాసభలను ప్రారంభించిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ పోషణ్ ట్రాకర్ యాప్‌లో అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలోనే నిర్వహించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఇంటర్నెట్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, ఇది ఆహార పంపిణీలో ఇబ్బందులకు దారితీస్తోందని రమేష్ అన్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానం వల్ల గర్భిణీ స్త్రీలు, పిల్లల ముఖ చిత్రాలు సేకరించడం, ఆధార్ లింక్‌తో ఓటీపీ ధృవీకరణ వంటి వాటివలన డేటా దుర్వినియోగం, సైబర్ మోసాల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ కారణంగా అంగన్‌వాడీ టీచర్ల సమయం వృథా అవడమే కాకుండా, కళ్లపై, మెడపై ఒత్తిడి పడి అనారోగ్య సమస్యలు



తలెత్తుతున్నాయన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క మాట్లాడుతూ పీఎం శ్రీ, ప్రీ ప్రైమరీ విద్యను కేవీ, నవోదయ వంటి స్కూల్స్‌కు అప్పగించినట్లయితే, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణను కోల్పోతారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు చదువుతో పాటు ఆహారం, ఆరోగ్య సంరక్షణ అందిస్తాయని, ఇది ఆకలి, ఆరోగ్య సమస్యలను తగ్గిస్తుందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్న పిల్లల బోధనలో శిక్షణ పొంది ఎంతో నైపుణ్యం గడించారని తెలిపారు. పీఎం శ్రీ విద్యను, ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ సెంటర్లకే అప్పగించాలి. ఐసీడీఎస్‌ను పర్మినెంట్ చేసి, అంగన్‌వాడీ సెంటర్లకు మెరుగైన ఆధునిక సౌకర్యాలు కల్పించాలి. లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఐసీడీఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఐసీడీఎస్‌ను ప్రభుత్వపరం చేసి అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలలో హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా కే. రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా జోత్స్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శోభారాణి ఎన్నికయ్యారు.

# సబ్ జైల్ లో న్యాయ విజ్ఞాన సదస్సు



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక సబ్ జైలును బాలల న్యాయమండలి సభ్యులు మేరుగు సుభాష్, డీపీఓ రమణ మూర్తితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు జైలు పరిసరాలను పూర్తిగా పరిశీలించి, ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జైలులో ఎవరైనా 18 ఏళ్ల లోపు వయస్సు గల బాలలు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే, ఖైదీలు ఏఏ నేరాలలో జైలు శిక్షలు అనుభవిస్తున్నారనే వివరాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడుతూ ఖైదీలు శిక్షా కాలంలో పూర్తి పరివర్తన చెందాలని, బయటకు వెళ్లిన తరువాత గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్, జైల్ సూపరిండెంట్ ప్రభాకర్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముందుకొస్తున్న దాతలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కాలం నాటి ప్రఖ్యాతిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో వచ్చే నెల నవంబర్ 14, 15, 16 తేదీలలో జరగనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గణపతి, శివలింగం, నవగ్రహాలు, అష్ట బలిపీఠం ప్రతిష్ఠాపన జరగనుంది. దీనికి తమ వంతుగా తోడ్పాటునందిస్తూ, గణపురం మండల కేంద్రానికి చెందిన బూర రజిత రాజగోపాల్ గౌడ్ (సీఐ) దంపతులు రూ. 33,000 విలువ గల గ్రానైట్‌ను ఆలయానికి అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ సమక్షంలో ఈ విరాళాన్ని స్వీకరించారు. ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఈ సందర్భంగా దాతలైన బూర రజిత, రాజగోపాల్ గౌడ్ దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడు, ఉయ్యాల బిక్షపతి గౌడ్, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్, గోరంటల రాజన్న గుప్త తదితరులు పాల్గొన్నారు.

# జీవిత బీమాతో కుటుంబానికి అండ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జీవిత బీమా ఏజెంట్ల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివ నాగ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత బీమా పాలసీలు చేసి వ్యక్తులు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. జీవిత బీమా ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఏజెంట్లను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర్, సేల్స్ మేనేజర్ రాజేష్ ఖన్నా, పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ రవి నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అచ్యుత్ రావు, మంథని సెటిలైట్ ఆఫీస్ మేనేజర్ రామ కిషన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు హరి కిరణ్, పీ.ఆర్.కే రెడ్డి, 300 మంది బీమా ఏజెంట్లు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో మహిళల ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలో నాగుల చవితి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితిగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పండుగ సందర్భంగా, డోర్నకల్ పట్టణంలోని రైల్వే ఏరియాలో ఉన్న నాగదేవత పుట్ట వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారు పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, నాగుల చవితి ఉత్సవాలను వైభవంగా జరిపారు. భక్తులు కుటుంబ సమేతంగా నాగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# పరకాలలో కుంకుమేశ్వర స్వామి నగరోత్సవం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం ధర్మ స్థలంలో నవంబర్ 3న కార్తీక సోమవారం రోజున నిర్వహించ తలపెట్టిన కార్తీక మాస మహా రుద్రయాగ మహోత్సవాన్ని పురస్కరించుకుని, నగరోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శనివారం నుంచి 27 సోమవారం వరకు మూడు రోజుల పాటు శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఈ నగరోత్సవం కొనసాగనుంది. ఈ మూడు రోజులు పరకాల పట్టణంలోని ప్రతి వీధిలో, ప్రతి ఇంటి సమీపానికి నగరోత్సవ వాహనం వెళుతుంది. పట్టణ ప్రజలు తమ స్వహస్తాలతో దేవస్థానానికి ధాన్యాన్ని సమర్పించే కార్యక్రమం శనివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మాజీ చైర్మన్ గందె వేంకటేశ్వర్లు, చందుపట్ల నరసింహారెడ్డి, బండి సారంగపాణి, గందె రవి, ఆముదాలపల్లి అశోక్, పావుశెట్టి అనిల్, గంజి వెంకటరెడ్డి, మొలుగూరి వెంకట్, సావుల రామ్, వసంత, పావుశెట్టి వెంకటేశ్వర్లు, సుకన్య, ప్రముఖులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ ఏర్పాటు

- అధ్యక్షుడిగా కందుల శ్రీధర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీయూడబ్ల్యూజే (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ – ఐజేయూ) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పీఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శ్రీరామ్ రాంచందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కమిటీలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు నూతన సభ్యులను నియమించారు. జాయింట్ సెక్రటరీగా బదావత్ బాలాజీ (ఆంధ్రప్రభ, వరంగల్), కార్యవర్గ సభ్యులుగా గూగులోతు నరసింహ (ప్రజాపక్షం, చెన్నారావుపేట మండలం), గాదెం రవి (తెలుగు పత్రిక, దుగ్గొండి మండలం)లను ఎంపిక చేశారు. అదేవిధంగా, వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కమిటీని కూడా ఈ సమావేశంలో నియమించారు. అధ్యక్షుడిగా కందుల శ్రీధర్ 99టీవీ వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ప్రధాన కార్యదర్శి ఊరటి రాజు బీఆర్కే న్యూస్ నర్సంపేట, కోశాధికారిగా ఎండీ నాజర్ ఆర్ టీవీ వర్ధన్నపేట, ఉపాధ్యక్షులుగా తరాల రవితేజ, స్వతంత్ర టీవీ వరంగల్ ఈస్ట్, దైనంపల్లి చైతన్య సిటీ న్యూస్ వరంగల్ ఈస్ట్, అమ్మ రాజు 1 0 టీ వీ నర్సంపేట, సహాయ కార్యదర్శులుగా బేతి ఉమాశంకర్ వీ5 న్యూస్ వరంగల్ ఈస్ట్, సిద్దోజు నితీష్ క్యూ న్యూస్ వరంగల్ ఈస్ట్, వీకే రవీందర్ మహా న్యూస్ వర్ధన్నపేట, కార్యవర్గ సభ్యులుగా పెసరి రాజేంద్రప్రసాద్, భారత్ టుడే వరంగల్, మేరుగు రాము వీ6 నర్సంపేట, ఆగారపు స్వామి ఎస్6 నర్సంపేట, మునుగోటి అనిల్ కుమార్ ఎన్ టీవీ వర్ధన్నపేట ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారి కోదాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు కూర్ణ వెంకటేశ్వర్లు, మహాదేవుని జగదీష్, జాయింట్ సెక్రటరీ లు బొమ్మగాని సతీష్ కుమార్, చింతనూరి రాజు, కార్యవర్గ సభ్యులు ఎండీ హుస్సేన్ పాషా, బాబర్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో నాగులచవితి పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పబ్లిక్ గార్డెన్ శివాలయంలో శనివారం నాగులచవితి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టకు పాలు పోసిన తర్వాత భక్తులకు అర్చకులు అవధానుల సీతారామ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు అర్చకులు అవధానుల సీతారామ శాస్త్రి తెలిపారు.

# కనకదుర్గ ఆలయంలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నర్సంపేట రోడ్డులోని శ్రీ కనకదుర్గ మాత దేవాలయం ఆవరణలో ఉన్న పురాతన నాగేంద్ర స్వామి దేవాలయంలో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే జువ్వి చెట్టు కింద ఉన్న నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి దర్శించుకుంటే భక్తుల కోరికలు నెరవేరుతాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

# ఐజేయూ జిల్లా జాయింట్ సెక్రటరీగా బాదావత్ బాలాజీ నాయక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీయూడబ్ల్యూజే/ ఐజేయూ) వరంగల్ జిల్లా కమిటీలో సీనియర్ రిపోర్టర్ బాదావత్ బాలాజీ నాయక్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎంపికయ్యారు. శనివారం వరంగల్ హంటర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఐజేయూ జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. జిల్లా కమిటీని మరింత బలోపేతం చేసేందుకు కొంతమంది సీనియర్ జర్నలిస్టులను కమిటీలోకి నూతనంగా తీసుకున్నట్లు ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐజేయూలో క్రియాశీలకంగా పనిచేస్తున్న బాదావత్ బాలాజీ నాయక్‌ను వరంగల్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐజేయూ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు రాంచందర్, దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ, ఐజేయూ నేతలు తనపై ఉంచిన నమ్మకంతో జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

## బీసీ సంక్షేమ సంఘం నేత కల్లూరి పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్‌లోని ఎంజీఎం (మహాత్మా గాంధీ మెమోరియల్) ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు కలగకుండా, ఆస్పత్రి సూపరింటెండెంట్ తక్షణమే చొరవ తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కల్లూరి పవన్ కోరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నిత్యం వివిధ ఆరోగ్య సమస్యలతో ఎంజీఎంకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి కావాల్సిన కనీస సౌకర్యాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. "ఒక ఆక్సిజన్ సిలిండర్‌ను ఇద్దరు రోగులకు పెట్టడం నిజంగా బాధాకరమైన విషయం. ఇలాంటి దయనీయ పరిస్థితులు పునరావృతం కాకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) తక్షణమే చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలి" అని కల్లూరి పవన్ డిమాండ్ చేశారు.

# ఐటీడీఏ కొత్త భవన నిర్మాణం త్వరగా చేపట్టాలి

## ◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ కొత్త భవన నిర్మాణ శంకుస్థాపన కొరకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఐటీడీఏ పి.ఓ. చిత్ర మిశ్రాతో కలిసి ఏటూరు నాగారం మండల కేంద్రంలో కొత్త భవన నిర్మాణం కొరకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొమురం భీమ్ స్పోర్ట్స్ స్టేడియం వద్ద అనువైన స్థలం గుర్తించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీడీఏ భవనం శిథిలావస్థలో ఉన్నందున, నూతన భవనం నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. అనంతరం ఏటూరు నాగారంలోని ఐటీడీఏ గిరిజన భవనంలో శంకర నేత్రాలయ ఎంఈఎస్‌యూ హైదరాబాద్, సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సందర్శించారు. శిబిరంలో చికిత్స చేయించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. కంటి పరీక్ష కేంద్రం వద్ద వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కంటి శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. తన సొంత ఊరి కోసం సినీ నటుడు, సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజోష్ చేస్తున్న సేవ కార్యక్రమాలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ సంజోష్ చేస్తున్న సేవ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు కంటి పొర చికిత్స పరీక్షల కోసం 590 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 110 మంది శస్త్ర చికిత్సకు అర్హులు అయ్యారని సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సినీ నటుడు సంజోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, తహసీల్దార్ జగదీశ్వర్, నిర్వాహకులు సంజోష్, ఉపేంద్ర రాచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో బెటాలియన్‌లో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, మామునూరు :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని, మామునూరులోని నాలుగో బెటాలియన్ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడి ఉన్నప్పటికీ, అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రక్తదానం అత్యవసర సమయాల్లో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాంబాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతి సంవత్సరం మూడు లేదా నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని, అలా చేయడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారని, రక్తం శుద్ధి అవుతుందని వివరించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి ముందుగా రక్తదానం చేసి ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది మొత్తం 75 మంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ పి.శ్రీనివాసరావు, ఇ.వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది, బెటాలియన్ మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, శిరీష, ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మరియు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బేకరీపై టాస్క్‌ఫోర్స్ కొరడా

## కాలం చెల్లిన ఉత్పత్తులు స్వాధీనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరంలో ఆహార భద్రత విషయంలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలనే గట్టి నిర్ణయంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ విభాగం శనివారం దాడులు నిర్వహించింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్ తన సిబ్బందితో కలిసి ఖిలా వరంగల్ పెట్రోల్ బంకు సమీపంలో నడుపుతున్న ఖజూర్ బెంగళూరు బేకరీ ప్రొడక్ట్స్ కంపెనీపై దాడి చేశారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్, ఎస్సై వి. దిలీప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తిలు సంయుక్తంగా పాల్గొన్నారు. బేకరీలో లైసెన్సు లేకుండా, కాలం చెల్లిన కూల్ కేక్ క్రీమ్ బాటిల్ ఫ్లేవర్స్, కేక్ కలర్స్, ఎక్స్పైరీ డేట్ లేని బేకరీ ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న సుమారు రూ. 11,005 విలువ గల దాదాపు 15 రకాల పాడైపోయిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బేకరీ యజమాని ఎం.డీ అనీఫ్ ను విచారణ నిమిత్తం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కి అప్పగించడం జరిగింది. వ్యాపారస్తులు ఆహార భద్రత విషయంలో ప్రభుత్వ లైసెన్సు లేకుండా, అపరిశుభ్రంగా, కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గడువు ముగిసిన, పాడైపోయిన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006, 2011 రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం ఫుడ్ సేఫ్టీ శాఖ సహాయంతో వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రామప్ప శిల్పకళా నైపుణ్యం అద్భుతం

## ▪ త్రిపుర కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ




**వరంగల్ వాయిస్, రామప్ప :** ములుగు జిల్లా పాలంపేటలోని రామప్ప దేవాలయంలోని ప్రతి ఒక్క శిల్పం ఆనాడు నిర్మించిన కాకతీయుల కళా నైపుణ్యానికి అద్దం పడుతుందని త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ ప్రశంసించారు. వరంగల్‌లో ఉన్న పర్యాటక క్షేత్రాలను వీక్షించడానికి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం హేమంత్ వర్మ దంపతులు హనుమకొండలోని నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌కు విచ్చేశారు. వారికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్‌డీ) సి.ప్రభాకర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం వారు వెంకటపురం మండలం, పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని, ఆలయ పూజారులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గైడ్ వారికి రామప్ప చరిత్రను వివరించారు. చైర్మన్ హేమంత్ వర్మ మాట్లాడుతూ రామప్ప శిల్పాలలో కళాత్మక వైభవం ఉట్టిపడుతున్నట్లుగా నిర్మించారని కొనియాడారు. యునెస్కో గౌరవం దక్కిన రామప్ప రాతిపై చెక్కిన శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతోందని పేర్కొన్నారు. "జీవకళ ఉన్న శిల్పకళాకృతులకు మరో రూపమే రామప్ప" అని కితాబునిచ్చారు. ఎంతో ఘన చరిత్ర గల రామప్పను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారు లక్నవరం సస్పెన్షన్ వంతెనపై విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈ (ఆపరేషన్, ములుగు) పులుసం నాగేశ్వర్ రావు, ఏడీఈ వేణు గోపాల్, విజిలెన్స్ ఎస్ఐ పురుషోత్తం, ఏ.ఈ.లు రమేష్, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
శనివారం 25 అక్టోబర్ 2025
7

## కాజోల్ టాక్ షోలో
## జాన్వీ ఆసక్తికర విషయాలు

# పురుషాధిక్యంలో మౌనమే సమాధానం

పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సిందేనని నటి జాన్వీకపూర్ అభిప్రాయపడ్డారు. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడిరచాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్`బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.



# అందరికీ కనెక్ట్ అవుతుంది




రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. ఇందులో రష్మికకు జోడీగా దీక్షిత్‌శెట్టి నటిస్తున్నారు. నవంబర్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధీరజ్ మాట్లాడుతూ.. రష్మిక ఈ సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారని.. విడుదలయ్యాక రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన కర్నూలు బస్సు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని రష్మిక విచారం వ్యక్తం చేశారు. జాగ్రత్తగా ఉండండి అని అందరూ చెబుతారని.. కానీ, అలాంటి పరిస్థితుల్లో మన చేతిలో ఏమీ ఉండదన్నారు. ఇక సినిమా గురించి మాట్లాడుతూ ఇది ప్రేమకథే కానీ.. ఇప్పటివరకూ ఇలాంటి కథను ఎవరూ తెరకెక్కించలేదన్నారు. చాలా సున్నితమైన కథతో దీన్ని రూపొందించారు. ఈ సినిమా కచ్చితంగా అందరికీ కనెక్ట్ అవుతుంది. రిలేషన్‌లో ఉన్నవారు ఎవరైనా ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజజీవితాలకు దగ్గరగా ఉంటుందీ చిత్రం. 13 ఏళ్ల నుంచి ఈ కథ గురించి ఆలోచిస్తున్నాను. నేను హాస్టల్‌లో ఉన్నప్పుడు జరిగిన ఓ చిన్న సంఘటన ఈ సినిమాకు పునాది. 5 ఏళ్ల క్రితం దాన్ని స్క్రీన్‌ప్లేగా రాసుకున్నాను. అది ఇన్ని రోజులకు మీ ముందుకు వచ్చిందని రాహుల్ రవీంద్రన్ అన్నారు. దీక్షిత్‌శెట్టి, రష్మిక అద్భుతంగా నటించారు. కచ్చితంగా ఈ చిత్రానికి అవార్డు వస్తుంది. రష్మిక అనడం కంటే ఇండియన్ క్రష్మిక అనాలేమో. ఈ సినిమాకు ప్రేయసితో వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండాలి. క్లైమాక్స్ అయ్యాక ఆ అమ్మాయి మిమ్మల్ని హగ్ చేసుకుంటే మీరు మంచి బాయ్‌ఫ్రెండ్.. సైలెంట్‌గా వెళ్లిపోతే మాత్రం కొట్టడం ఖాయం అని బన్నీ వాసు సరదాగా చెప్పారు.



# నా దొంగ మొగుడు తెల్లటి దుస్తులు వేశాడు

### ప్రశాంత్ నీల్ దుస్తుల ఫొటోపై భార్య పోస్ట్ వైరల్

సినిమా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, ఎప్పుడూ తన సినిమాలతోనే కాదు, తన స్టైల్‌తో కూడా చర్చల్లో ఉంటారు. పుట్టింది బెంగళూరులో అయినా తెలుగు కుటుంబానికి చెందిన ప్రశాంత్ చిన్నప్పటి నుంచి టాలీవుడ్ ప్రభావంలో పెరిగాడు. ఆ ప్యాషన్‌నే ఆయన కెరీర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన దర్శకత్వం వహించిన కేజీఎఫ్ చాప్టర్ 1, 2, అలాగే సలార్ చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్‌గా నిలిచాయి. షూటింగ్ లొకేషన్లు కూడా పొగతో, బొగ్గు బ్యాక్‌డ్రాప్‌లతో నిండిపోతాయి. ఈ కారణంగా అభిమానులు సరదాగా 'నీల్‌కి ఈ బ్లాక్ మీద పిచ్చేంటి?' అని కామెంట్లు చేస్తుంటారు. అయితే, ఈ సారి మాత్రం ప్రశాంత్ నీల్ తన అభిమానులను ఆశ్చర్యపరిచాడు. ఎందుకంటే ఆయన మొదటిసారి నల్ల దుస్తులు వదిలేసి తెల్ల సాంప్రదాయ డ్రెస్‌లో కనిపించాడు. ఒక కుటుంబ వేడుకలో భాగంగా అలా రెడి అయ్యారు. ఆ లుక్ చూసిన ఆయన భార్య లిఖితా రెడ్డి ఎమోషనల్ అయి, వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఫైనల్‌గా నా దొంగ మొగుడు తెల్ల బట్టలు వేసాడు అని సరదాగా రాసిన లిఖితా పోస్ట్ క్షణాల్లో వైరల్ అయిపోయింది. అభిమానులు కూడా ఆ ఫోటోపై ఫన్నీ, లవ్‌ఫుల్ కామెంట్లు పెడుతున్నారు. ఎప్పుడూ కఠినమైన, ఇంటెన్స్ లుక్‌లో కనిపించే ప్రశాంత్ నీల్ ఈ సారి సింపుల్ తెల్ల దుస్తుల్లో కనిపించడంతో, అభిమానులు 'సర్‌కి ఈ లుక్ సూపర్‌గా సూట్ అయ్యింది' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# రాజాసాబ్ ప్రమోషన్‌లో కొత్త ఒరవడి

### ప్రత్యేకంగా షూట్ చేస్తున్న ప్రమోషన్ వీడియో

ప్రభాస్ అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఒక ఆసక్తికరమైన వార్త తెర మీదకు వచ్చింది. 'రాజా సాబ్' సినిమా విడుదలకు ముందు చిత్ర యూనిట్ మరో ట్రైలర్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. అయితే, ఈసారి ట్రైలర్ విషయంలో దర్శకుడు మారుతి ఒక సరికొత్త పద్ధతిని అనుసరించబోతున్నారు. సాధారణంగా సినిమాలలోని కీ షాట్స్‌తో ట్రైలర్ కట్ చేస్తుంటారు. కానీ, 'రాజా సాబ్' కోసం విడుదల చేయబోయే ఈ రెండో ట్రైలర్‌ను సినిమాలోని సన్నివేశాలతో కాకుండా, దీనికోసం స్పెషల్‌గా షూట్ చేయాలని దర్శకుడు మారుతి భావిస్తున్నారు. ఈ స్పెషల్ వీడియో ప్రమోషనల్ వీడియోలా ఉంటూనే, పూర్తిస్థాయి ట్రైలర్ అంత ఎఫెక్ట్‌ను కలిగించేలా డిజైన్ చేయబోతున్నారు. ఓ రకంగా చూస్తే, సినిమా ప్రమోషన్స్‌లో 'రాజా సాబ్' తో ఒక కొత్త ట్రెండ్ మొదలు కావచ్చు. అయితే ఇది పూర్తిగా కొత్త స్ట్రాటజీ అని చెప్పలేం. ఎందుకంటే సినిమా మీద ఆసక్తి కలిగించేలా ఉన్నా కొన్ని డైలాగ్స్, షాట్స్ తో చేసిన కొన్ని ట్రైలర్స్ ఇప్పటికే రిలీజ్ చేసి తర్వాత సినిమాలో అవి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ సినిమా విషయంలో కూడా దాదాపుగా అదే స్ట్రాటజీ ఫాలో అవ్వబోతున్నారు. ఈ వినూత్న ప్రమోషనల్ స్ట్రాటజీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.



# తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- కేయూలో నెలవారీ నేర సమీక్ష



**వరంగల్ వాయిస్, క్రైం :** డయల్ 100 కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం సమావేశ ప్రాంగణంలో శనివారం సీపీ అధ్యక్షతన నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో సీపీ సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కు గల కారణాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహారిస్తూనే వారి కదలికలు, స్థితి గతులపై నజర్ పెట్టాలన్నారు. గత కొద్ది కాలంగా రౌడీ షీటర్లు స్థానికంగా లేకుంటే, అతను ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతానికి చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చోరీలకు పాల్పడిన నిందితులతో పాటు, గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇప్పించడమే కాకుండా, నిందితుడిని పట్టుకొనేందుకు స్టేషన్ అధికారులు కృషి చేయాలని, పొక్సో కేసుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలన్ని గడువులోపు పూర్తి చేయాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ అధికారిగా ఎస్ఐ స్థాయి అధికారి తప్పక విధులు నిర్వర్తించాలని, ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు తమ పరిధిలో పెండింగ్ లో ఉన్న ట్రాఫిక్ జరిమానాదారులకు ఫోన్ చేసి జరిమానా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ ఉన్నా అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించొద్దని సూచించారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర ఉన్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్లలో ఆహ్లాదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచాలని ఇందుకోసం ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్ లో శ్రమదానం చేయాల్సి ఉంటుందని సీపీ పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, డీసీపీ అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఏఎస్పీ చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామితో పాటు ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# కన్నుల పండుగలా కార్తీక దీపోత్సవం

- ఎండోమెంట్ అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్తీక మాసోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించాలని.. రాష్ట్రంలోని ప్రతి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలకరించాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ సంవత్సరం కార్తీక దీపోత్సవం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 19 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు శైలజ రామయ్యర్, హరీష్, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంటు కమిషనర్లు, ఈవోలతో శనివారం మంత్రి కొండా సురేఖ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల ఈవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... కార్తీక మాసం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని గుర్తు చేశారు. ఈ కార్తీక మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదంగా ఉంటుందని అన్నారు. సామూహిక కార్తీక దీపోత్సవం అంటే అందరూ కలిసి దేవాలయ ప్రాంగణములో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చేయాలని గుర్తు చేశారు. గతంలో నిర్వహించినట్లుగా ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించుటకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవం సాయంత్రం 6 గంటల నుంచి జరపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటుగా పసుపు కుంకుమ తాంబూలాలను అందచేస్తున్నట్టు వివరించారు. కార్తీక సోమవారం నాడు సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతో పాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, ఏదైనా పండు, కనుము ప్రధాన దేవాలయలలో భక్తులకు ఇస్తున్నట్టు తెలిపారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు దీపాలు ఒదలటానికి అవసరమైనచోట తాత్కాలిక వాటర్ పాండ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నదీ పరివాహక ప్రాంతాలలోని దేవాలయాలలో నది హారతి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తుల కొరకై బ్రహ్మశ్రీ నాగఫణిశర్మ, శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గార్లచే ప్రముఖ దేవాలయములలో ప్రవచనాలతో పాటుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నివేదించారు.

## కళాకార్ సంఘ్ జాతీయ సమావేశానికి..

# మంజులకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఈ నెల 28 న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీలో జరుగనున్న భారతీయ కళాకార్ సంఘ్ సమావేశానికి హాజరుకావాలంటూ హనుమకొండ జిల్లా గోపాలపురానికి చెందిన ప్రముఖ చిత్రకారిణి, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎల్బీ కళాశాల అధ్యాపకురాలైన డాక్టర్ మంజుల సాగంటికి ఆహ్వానం అందింది. చిత్ర కళ అభివృద్ధికి చేస్తున్న సేవను గుర్తించి సంస్థ జాతీయ అధ్యక్షులు అంకూర్, ప్రధాన కార్యదర్శి కుమార్ తనను ఎంపిక చేసినట్లు మంజుల వెల్లడించారు. వారి సంస్థ తరుపున తెలంగాణ రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించే ఆలోచనతో తనకు ఆహ్వానం అందిందని మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. దేశం నలుమూలల నుంచి వేల మంది ఆర్టిస్టులు ఈ సమావేశానికి హాజరు కానున్నారన్నారు. తనని, తన సేవని గుర్తించి ఆహ్వానించిన సంస్థ నిర్వాహకులకు మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆహ్వానం పట్ల ప్రముఖ కళాకారులు ఆమెకు అభినందనలు తెలిపారు.

# మార్నింగ్ ప్రెజెంట్.. మిడ్డే ఆబ్సెంట్

- నామమాత్రంగా తెరుచుకుంటున్న అంగన్వాడీ సెంటర్లు
- పౌష్టికాహారానికి దూరమవుతున్న చిన్నారులు
- నీరుకారుతున్న స్టేట్, సెంట్రల్ స్కీం
- నిర్లక్ష్యానికి ఆజ్యం పోస్తున్న ప్రజాప్రతినిధులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారిని భవ్య ప్రపంచ వైపు నడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలు కొందరూ టీచర్ల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నాయి. అంగన్వాడీలను పకడ్బందీగా నిర్వహించేందుకు అనేక సంస్కరణలు చేపడుతూ, టెక్నాలజీని వినియోగిస్తున్నప్పటికీ గాడిన పడడంలేదు. రవంతు చాన్స్ దొరికితేచాలు సెంటర్లు క్లోజ్ చేస్తున్నారు. టీచర్లు రాకపోవడంతో చిన్నారులు ఇంటికే పరిమితమైన దృశ్యాలు పలు తండాలు, గూడాల్లో దర్శణమిస్తున్నాయి. అయితే దుమ్మాకొట్టి దొరికిపోయిన టీచర్లను స్థానిక ప్రజా ప్రతినిదులు వెనుకేసుకు రావడంతో అంగన్వాడీల మూతకు ప్రధాన కారణంగా మారుతోంది. దీంతో అంగన్వాడీ సెంటర్లు నిరాదరణకు గురై చిన్నారులు చిరు ప్రాయంలోనే ప్రైవేట్ దారి పడుతున్నారు.

### మధ్యాహ్నం బంద్..

డోర్నకల్ మండలంలోని పలువరు అంగన్వాడీ టీచర్లు ఉదయం సెంటర్లకు చేరుకొని ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు వేసుకొని తర్వాత సెంటర్లను ఆయాలకు అప్పజెప్పి తమ సొంత పనులకు పోతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. టీచర్లలకు ఎటువంటి ఇతర డ్యూటీలు లేకపోయినప్పటికీ పొలం లేదా ఫంక్షన్ లకు హాజరవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. సంబంధిత గ్రామ, తండా ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ టీచర్లు వారి ప్రవర్తన మార్చుకోవటం లేదంటున్నారు.

### సీతక్క టెలికాన్ఫరెన్స్..

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై మంత్రి సీతక్క రాష్ట్రంలోని వివిధ జిల్లా అధికారులతో శుక్రవారం సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారు. అంగన్వాడి సెంటర్లలో విద్యుత్ కనెక్షన్, తాగునీటి సదుపాయం, మరుదడ్ల నిర్మాణం పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. బాలామృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువులతో పాటు పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె తప్పుదారి పట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ టీచర్లు ఉదయం 9 గంటల లోపు సెంటర్లు తెరువాలన్నారు. అలసత్వం, ఆలస్యంగా తెరిచే సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ ఏకే సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్చరించారు. సీడీపీఓలు, సూపర్వైజర్లు, టీచర్లతో జరిగిన సమావేశంలో పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిష్టం విజయవంతంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలని వారిపై ప్రత్యేక దృష్టితో ఎడ్యుకేషన్, హెల్త్, న్యూట్రిషన్, శానిటేషన్ తదితర అంశాలపై ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. అంగన్వాడి సెంటర్లను తెరిచి హాజరు వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీడీపీఓలు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో ప్రతి కేంద్రాన్ని తనిఖీ చేసి రిజిస్టర్ లను పరిశీలించాలన్నారు. ఇంత పెద్ద మీటింగ్ జరిగి రోజు గడవక ముందే డోర్నకల్ అంగన్వాడీ కేంద్రాల్లో కొందరు టీచర్లు నిర్లక్ష్యం వహించడంపై చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

డోర్నకల్ మండలంలోని బోరింగ్ తండా అంగన్వాడీ కేంద్రాన్ని మధ్యాహ్నం 2.20 గంటలకు వరంగల్ వాయిస్ ప్రతినిధి సందర్శించగా తాళం వేసి ఉంది. దీనిపై సూపర్వైజర్ వెంకటరమణకు ఫోన్ చేసి అడగగా అంగన్వాడీ టీచర్లకు ఎటువంటి ఇతర డ్యూటీలు లేవని తెలిపారు. సెంటర్ క్లోజ్ చేయడంపై సీడీపీఓ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వెంటనే బోరింగ్ తండా అంగన్వాడీ కేంద్రం టీచర్ కు మెమో జారీ చేయడంతోపాటు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com